# చైతన్యంలేని ప్రగతి సోషలిజానికి చేటు

తూర్పు యూరప్‌లోనూ సోవియట్ రష్యాలోనూ ఇటీవల వచ్చిన మార్పులను తేలికగా తీసిపారేయడం సులభమే; వాటిని అర్థం చేసుకుని గుణపాఠాలు తీసుకోవడమే కష్టం. సోషలిజం విఫలం అయిపోయిందని అంటున్న వాళ్ళకు ఆ అవసరం లేదు. వాళ్ళు సోషలిజం సాధ్యమని ఏనాడూ నమ్మలేదు. ఇప్పుడది విఫలం అయిందని వాళ్లు ప్రకటిస్తే దానిని ఒక కొత్త అభిప్రాయంగా భావించనవసరమూ లేదు. అయినా, సోషలిజం విఫలం అయిందని బాధపడే వాళ్ళ విమర్శను మార్క్సిస్టులు పట్టించుకోవాలిగానీ సంతోషించే వాళ్ళ అభిప్రాయాలతో మార్క్సిస్టులకేం పని?

బాధపడవలసిన అవసరం ఏమిటంటే, సోషలిజం విఫలం అయితే ఇక ప్రపంచంలో మిగిలింది పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక్కటే. ఇవి రెండూ కాక వేరే వ్యవస్థలు గతంలో ఉన్నాయి గానీ వాటికి కాలం చెల్లిపోయింది. ఇప్పుడు ఈ రెండింటిలో ఒకటి తప్ప వేరే ఏదీ సాధ్యం కాదు. కాబట్టి, సోషలిజం విఫలమయిందని అనేవాళ్ళు, ఇకపైన మనం ఎల్లకాలం పెట్టుబడిదారీ వ్యవస్థలో బతకడానికి సిద్ధంగా వున్నామా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. మనుషుల శ్రమను వ్యాపార సరుకుగా మార్చి ఆ సరుకుకు గిరాకీ తక్కువయినప్పుడల్లా కోట్లాది జనాన్ని నిరుద్యోగంలో పడేసే వ్యవస్థలో ఎల్లకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? మనుషుల శ్రమనే కాక, సకల జీవిత

అవసరాలనూ వ్యాపార సరుకులుగా మార్చి డబ్బున్నవాళ్ళ అవసరాలను మాత్రం తీర్చే వ్యవస్థలో కలకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? తన లాభార్జన కోసం మనకు లేని అవసరాలనూ అక్కరలేని కోరికలనూ కల్పించి మనిషిలోని అల్పత్వాన్ని అంతా బజార్లో పెట్టి దానిని సంతృప్తిపరచడం కోసం ప్రకృతిని ధ్వంసం చేసి మనకు ఆరోగ్యమూ మనశ్శాంతీ లేకుండా చేసే వ్యవస్థలో ఇక శాశ్వతంగా బతకదల్చుకున్నామా? స్వార్థాన్నీ అవినీతినీ అబద్ధాన్నీ ప్రకృతి సహజమయిన విషయాలుగా భావించి 'ఇది మానవనైజం' అనే నైరాశ్య తత్వాన్ని బోధించే వ్యవస్థలో ఎల్లకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? చివరికి కళను సహితం వ్యాపార సరుకుగా మార్చి మనుషుల బలహీనతలను రెచ్చగొట్టి డబ్బులు చేసుకునే సంస్కృతిని కలకాలం భరించడానికి సిద్ధంగా వున్నామా? స్త్రీలకూ పురుషులకూ, కూలివాళ్ళకూ మేధావులకూ, పట్టణాలకూ గ్రామాలకూ, మధ్య తరతరాలుగా వుంటూ వున్న అసమానతలను పోగొట్టే బదులు తన లాభార్జన కోసం కొత్త రూపాలలో పునరావృతం చేసే వ్యవస్థలో శాశ్వతంగా బతకదల్చుకున్నామా? అన్ని వస్తువులూ వ్యాపార సరుకులయిపోయిన వ్యవస్థలో మనుషులకు ఒంటరితనమూ ఆ ఒంటరితనానికీ మత్తుపదార్థాలూ మాదకద్రవ్యాలూ తప్ప వేరే పరిష్కారం చూపించలేని సమాజానిన ఎల్లకాలం భరించడానికి సిద్ధంగా వున్నామా?

ఈ ప్రశ్నలు ప్రతీ ఒక్కరూ తమకు తాము వేసుకొని సమాధానం చెప్పుకోవాలి. ఇట్లా బ్రతకడానికి సిద్ధంగా లేమని సమాధానం చెప్పుకునేటట్టయితే సోషలిజం విఫలం అయిందని కేరింతలు కొట్టడం మానేసి, అది ఎందుకు విఫలం అయిందో ఆలోచించి, తిరిగి సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం విజయవంతంగా చేయాలంటే ఏం చేయాలో ఆలోచించాలి. బోల్షివిక్ విప్లవం జరిగి 70 ఏళ్ళు దాటింది. తూర్పు యూరప్‌లోనూ చైనాలోనూ సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడి 40 ఏళ్లు దాటింది. ఈ ప్రభుత్వాలేవీ సోషలిజానికి ద్రోహం చేయాలనే లక్ష్యంతో ఏర్పడలేదు. సోషలిజం సాధించాలనే లక్ష్యంతోనే ఏర్పడ్డాయి. అయినా చివరికి అన్నీ విఫలం అయి పెట్టుబడిదారీ మార్కెట్ ఆధిపత్యానికీ రాజకీయ ఆధిపత్యానికీ దాసోహం అనే స్థితికి దిగజారాయి. గోర్బచెవ్ ఈ పతనాన్ని సిద్ధాంతీకరిస్తున్నాడు. ఈ చరిత్రను సమీక్షించుకొని ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించాలి.

సమగ్రమయిన సమీక్ష చేయడానికి ఒక్క వ్యాసం సరిపోదు గానీ, రెండు ముఖ్యమయిన విషయాలు చెప్పాలి. మొదటిది ఆర్థిక వ్యూహానికి సంబంధించినది. రెండవది రాజకీయ నిర్మాణానికి సంబంధించినది. బోల్షివిక్ విప్లవం జరిగిన నాటికీ

రష్యా పారిశ్రామికంగా చాలా వెనకబడ్డ దేశం. ఆ దేశంలో వేగంగా పారిశ్రామిక ప్రగతిని సాధించడం అవసరం అని సోవియట్ కమ్యూనిస్టులు భావించారు. జల భౌతిక జీవితాన్ని ఆధునిక సాంకేతిక ప్రక్రియల ప్రాతిపదిక మీద పునర్నిర్మించాలని భావించారు. జోగీ జోగీ రాసుకుంటే రాలేది బూడిదేననీ, గరీబుగాళ్ళ సమానత్వం నిజమయిన సోషలిజం కాదనీ, సుఖవంతమయిన జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక ప్రగతిని సాధించాలనీ అనుకున్నారు. ఈ ఆర్థిక ప్రగతిని సాధించడానికి దేశంలోని భారీ పారిశ్రామికరంగాన్ని చాలా వేగంగా అభివృద్ధి చేశారు. అసాధారణమైన టోకు ఉత్పత్తి పెరుగుదల రేటును సాధించారు. వాడకపు వస్తువుల ఉత్పత్తిని తగ్గించి (తిండి, బట్టలు, ఇళ్ళు, గృహ పరికరాలు, రవాణా సాధనాలు వగైరా), భారీ యంత్రాల ఉత్పత్తి మీద కేంద్రీకరించారు. తూర్పు యూరప్ దేశాలలోనూ సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ఇదే జరిగింది. గనులు, ఇనుము, ఉక్కు కర్మాగారాలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులను పెద్దఎత్తున నిర్మించారు. తూర్పు యూరప్ దేశాలలో యంత్రసామగ్రి ఉత్పత్తి 1950-60 దశాబ్దంలో సగటున 500 శాతం పెరిగింది. జాతీయ ఆదాయంలో పారిశ్రామిక రంగం వాటా 1950 నాటికి 50 శాతం లోపు ఉండింది. 1980 నాటికి ఇది కొన్నిదేశాలలో 80 శాతానికి, జెకస్లోవేకియా, తూర్పు జర్మనీ, పోలండ్ దేశాలలోనయితే 90 శాతానికి పెరిగింది.

ఇదంతా అవసరమే, ఎవరూ కాదనలేరు. అయితే క్రమంగా ఈ అవసరమే సోషలిజం లక్ష్యం అయికూర్చుంది. నూతన సమాజాన్నీ సామాజిక సమానత్వాన్నీ, ప్రజలు తమ జీవితాలను తామే శాసించుకునే సామాజిక వ్యవస్థను నిర్మించే ప్రయత్నం ప్రక్కకు పోయి, ఇంకింత వేగంగా మరింత వేగంగా ఉత్పత్తి రంగాన్ని ముందుకు తీసుకుపోవడమనేది ప్రధాన లక్ష్యం అయింది. అట్లంటే సమానత్వ సాధన కోసం ఏమీ చేయలేదని కాదు. అందరికీ చదువు చెప్పారు, వైద్య సదుపాయాలు కల్పించారు, స్త్రీలకు ఇంటి బయట ఉద్యోగాలు చేసే అవకాశాలు కల్పించారు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు సంస్కృతిలో మానవీయమయిన విలువలను ప్రోత్సహించారు.

అయినప్పటికీ, నూతన సమాజ నిర్మాణాన్ని ఆర్థిక పురోగమనంలో అంతర్భాగమయిన విషయంగా చూడకుండా, సుదూర భవిష్యత్తులో జరిగే ప్రయత్నంగానే భావిస్తూ, ప్రస్తుతానికి అమెరికా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలను ఆర్థిక సాంకేతిక ప్రగతిలో అందుకోవడమే ముఖ్య లక్ష్యంగా

ప్రజల ముందు నిలబెట్టారు. ఇంక 15 ఏళ్ళలోనో, 20 ఏళ్ళలోనో అమెరికాను అందుకుంటాం అనేది ఈ ప్రభుత్వాలు ప్రజలకు ఇస్తూ వచ్చిన ముఖ్యమయిన వాగ్దానం. ఇప్పుడు పెరిస్త్రోయికా పేరుతో గోర్బచెవ్ ప్రవేశపెడుతున్న మార్పులలో భాగంగా ఈ తప్పుడు వైఖరి మరింత ప్రబలం అవుతూ వుంది. అమెరికాలో తలసరి ఎన్ని కార్లు వున్నాయి, ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి, రోజుకు ఎన్ని లీటర్ల పెట్రోలు తగలేస్తారు - మనం ఆ స్థాయిని ఎప్పుడు అందుకుంటాం అనేది ఈ దేశాలలో సోషలిజం విజయానికి గీటురాయి అయింది. సోషలిజం అంటే ఏమిటి అంటే అన్ని వ్యవస్థల కంటే వేగంగా ఆర్థిక అభివృద్ధిని సాధించే వ్యవస్థ అనే తప్పుడు నిర్వచనం ఇస్తూ వచ్చారు ఈ దేశాల పాలకులు.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రీకృతంగా ప్రణాళికలు రచించి మూఢంగా అమలు చేశారు. ఏం ఉత్పత్తి చేయాలి, ఎంత ఉత్పత్తి చేయాలి, ఎక్కడ ఉత్పత్తి చేయాలి అనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. కార్మికులూ రైతులూ కిమ్మనకుండా ఉత్పత్తి చేయాలి, సమ్మెలు చేయడానికి వీలులేదు, ఆందోళనలు చేపట్టడానికి వీలులేదు. నిరసన సహితం వ్యక్తం చేయడానికి వీలులేదు. ఇదంతా మీ మంచి కోసమే కాబట్టి నిర్బంధాన్ని నోరుమూసుకుని సహించండి అన్నారు. ఈ స్వేచ్ఛ మాత్రమే కాదు, తగుమాత్రం తిండి, బట్ట, ఇతర జీవిత అవసరాలు కూడా సరిగ్గా ఇవ్వకుండా పెట్టుబడిని విపరీతంగా భారీ పరిశ్రమలలో కేంద్రీకరించారు.

ఈ వైఖరిని మొదటి నుండీ విమర్శించిన కమ్యూనిస్టు నాయకుడు మావో ఉత్పత్తి సాధనాలనూ పరికరాలనూ మెరుగుపరచుకుంటూ పోవడమే ఆర్థిక ప్రగతికి మార్గం అనేది తప్పుడు సిద్ధాంతం అని మావో విమర్శించాడు. దానిని ఆయన 'ఉత్పత్తిశక్తుల సిద్ధాంతం' అన్నాడు. కార్మికుల చైతన్యాన్ని పెంచడం, సమానత్వాన్నీ స్వావలంబననూ పెంపొందించడం, ఉత్పత్తిక్రమంగా మీదా పునరుత్పత్తిక్రమం మీదా శ్రామికుల ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రయత్నాన్ని చేపట్టడం - ఈ చర్యలను ఆర్థిక ప్రగతికి కీలకంగా తీసుకోవాలని మావో భావించాడు. ఇవ్వాళ చైనాలోనే ఆ సిద్ధాంతాన్ని తిరస్కరించారు. తూర్పు యూరప్‌లోనూ సోవియట్ రష్యాలోనూ ఆ అవగాహన ఏ రోజూ లేదు. స్టాలిన్ కాలం నుండి ఈ రోజుదాకా ఆ దేశాలలో 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంత'మే రాజ్యం చేస్తోంది.

ప్రజలలో చైతన్యాన్ని పెంచకుండా, సోషలిజం నిర్మిస్తున్నామనే భావన పెంపొందించకుండా ఆర్థిక ప్రగతిని వేగంగా సాధించాలని ప్రయత్నం చేయడం చాలా సమస్యలకు దారితీసింది. ప్రజలు తమ జీవితాలను తామే శాసించుకునే వ్యవస్థలో తమ అందరి భవిష్యత్తు కోసం, తమ సమాజం కోసం శ్రమ చేస్తారు.

త్యాగాలూ చేస్తారు. అది లేనప్పుడు ఎవరికి వారు స్వలాభం కోసమయినా పని చేయాలి, లేదా ఉద్యోగం పోతుందన్న భయంతోనయినా పని చేయాలి. పెట్టుబడిదారీ దేశాలలో చిన్న ఉత్పత్తిదారులు స్వలాభం కోసం శ్రమ చేస్తారు. కూలివాళ్ళూ కార్మికులూ పనిలోనుండి తీసేస్తారన్న భయంతో పనిచేస్తారు. సోషలిస్టు దేశాలలో ఉద్యోగ భద్రత కల్పించారు కాబట్టి భయం లేదు. (కూలివాళ్ళకు భయం లేకుండా పోయింది కాబట్టి ఉద్యోగ భద్రత ఇంతగా ఉండడానికి వీలు లేదనేది 'పెరిస్త్రోయికా' ప్రతిపాదనలలో ఒకటి!) స్వంత ఆస్తి ఎక్కువగా వుండదు కాబట్టి స్వలాభానికి అవకాశం తక్కువ. అందువల్లే సోషలిజంలో ప్రజల చైతన్యాన్ని పెంచడానికి కృషి చాలా అవసరం. నూతన సమాజ నిర్మాణాన్ని భవిష్యత్తుకు వాయిదా వేయకుండా మొదటి నుంచీ చేపట్టడం అవసరం. నూతన సమాజాన్ని నిర్మించే క్రమంలో విముక్తమయ్యే అపారమయిన చొరవ, ఉత్సాహం సోషలిస్టు ఉత్పత్తికి ప్రాతిపదిక కావాలి. అది జరగకపోతే ఉత్పత్తిలో అసమర్ధత, వనరుల వ్యర్థ ప్రయోగం, నిపుణతలోనూ నాణ్యతలోనూ లోటు పెరిగిపోతాయి. తూర్పు యూరప్ దేశాలలోనూ సోవియట్ రష్యాలోనూ ఇదే జరిగింది. ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి పాశ్చాత్య దేశాలలో ఖర్చు అయ్యే పెట్టుబడి కంటే 50 శాతం ఎక్కువ సోవియట్ రష్యాలో ఖర్చు అవుతుందని అంచనా. పెట్టుబడి ఈ విధంగా చాలా వృథా కాసాగింది. గత 30 సంవత్సరాలుగా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఆధారంగా చాలా వేగంగా పురోగమిస్తూ వున్న పాశ్చాత్య పెట్టుబడిదారీ పారిశ్రామిక రంగాన్ని అందుకోవడం సోవియట్ రష్యాకూ తూర్పు యూరప్ దేశాలకూ చాలా కష్టం అయింది. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి ఈ దేశాలు పెట్టుబడిదారీ పద్ధతులను అనుసరించడం మొదలుపెట్టాయి. స్వలాభాన్నీ ఆర్థిక ప్రోత్సాహాలనూ ఎరగా చూపించి కార్మికుల సామర్థ్యాన్నీ నిర్వహణా నైపుణ్యాన్నీ పెంచాలని చూశారు. భూమిని రైతులకు 'లీజుకు' ఇవ్వడం మొదలుపెట్టారు. పెట్టుబడిదారీ దేశాలలో దొరికే రకరకాల విలాస వస్తువులను తమ దేశాలలోనూ తయారు చేయడమో లేక దిగుమతి చేసుకొని అమ్మడమో మొదలుపెట్టారు. ఇవన్నీ 1965 తరువాత బాగా పెరిగాయి. 1970 తర్వాత పాశ్చాత్య దేశాలనుండి 'ఆధునీకరణ' పేరిట పెద్దఎత్తున పెట్టుబడినీ సాంకేతిక ప్రక్రియలనూ దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టారు. తీవ్రంగా అప్పులలో పడ్డారు.

అయినప్పటికీ ఈ ప్రభుత్వాలు రాజకీయంగా ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకొనివుంటే సమస్యను గట్టెక్కించేవేమో, అయితే ఆ పరిస్థితి మొదటినుండి

కూడా లేదు. క్రమంగా ప్రజాపునాదిని కోల్పోయారు. ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని గురించి ప్రజలకు ఎన్నడూ నిజం చెప్పలేదు. అప్పు ఎంతగా పెరిగిపోయిందీ చెప్పలేదు. సాంకేతిక పురోగతిని సాధించలేకపోతున్నాం అని ప్రజలముందు ఒప్పుకోలేదు. తాము శాస్త్రీయ సోషలిజాన్ని అమలు చేస్తున్నాం అని బింకంగా ఆత్మస్తుతి చేసుకోవడం మానలేదు. ప్రజలు చేతకానితనాన్నీ వైఫల్యాన్నీ క్షమిస్తారేమోగానీ అబద్ధాలనూ బూటకపు ప్రగల్భాలనూ క్షమించరు. దాంతో సోవియట్ రష్యా, తూర్పు యూరప్ ప్రభుత్వాలు తమ విశ్వసనీయతను పూర్తిగా పోగొట్టుకున్నాయి.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వాలు సమస్యల పరిష్కారానికి రకరకాల తాయిలాలు ఇవ్వాలని చూశాయి. ఉన్నతమైన సోషలిస్టు చైతన్యం ద్వారా, నూతన సమాజాన్ని నిర్మించే క్రమంలో పెల్లుబికే ఉత్సాహం ద్వారా పరిష్కారం కావలసిన సమస్యలను ఆర్థిక ప్రోత్సాహకాలతో పరిష్కారం చేయాలని ప్రయత్నించారు. దీనివల్ల సోషలిస్టు చైతన్యం మరింత దెబ్బతిన్నది. మీ స్వార్థం కోసం తప్ప మీరు పనిచేయరు కాబట్టి మీకు డబ్బులిచ్చి పని చేయించుకుంటామని ఒకవైపు చెప్తూ, మళ్ళీ అంతలో సోషలిజం కోసం త్యాగం చెయ్యండి అని ప్రజలను అడగడంలోగల ఔచిత్యం ఏమిటో ఈ 'సోషలిస్టుల'కే తెలియాలి. ఒకనాడు సోవియట్ రష్యాలోనూ చైనాలోనూ నూతన సమాజాన్ని నిర్మించే ఉత్సాహంలో జనం రోజుకు ఒకపూట తిండి తిని లక్షల ఎకరాల బంజర్లను సాగులోకి తెచ్చారు. వేలాది చిన్న పరిశ్రమలను నిర్మించి ఇనుము, ఉక్కు తయారుచేసి చేతులు కాల్చుకున్నారు. రాత్రిళ్ళు స్కూళ్ళు నడిపి అందరినీ అక్షరాస్యుల్ని చేశారు. వైద్యులు మారుమూల గ్రామాలు తిరిగి వైద్య సౌకర్యాలు కల్పించారు. ఆ చైతన్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి స్వార్థానికీ స్వప్రయోజనానికీ పట్టంగట్టి 'అమెరికాను పదేళ్ళలో అందుకోవాలి' అనే మతిలేని ఆదర్శాన్ని సోషలిజం లక్ష్యంగా సిద్ధాంతీకరించి, ఇప్పుడు త్యాగం చేయండి అంటే జనం ఎందుకు సిద్ధపడతారు? విదేశీ అప్పులు తీర్చడం కోసం పోలండ్, రుమేనియా, హంగేరీ లాంటి దేశాలలో రొట్టె, మాంసం మొదలయిన నిత్యజీవిత అవసరాలను సహితం ఎగుమతి చేయడం మొదలుపెట్టారు. దానితో జనం తిరగబడ్డారు. ఆ త్యాగాన్ని పాలకులు కూడా పంచుకుంటే జనం కొంత ఊరట చెందేవారేమోగానీ ఈ దేశాల 'సోషలిస్టు' నేతలు చాలా సుఖాలకూ సౌకర్యాలకూ విలాసాలకూ అలవాటు పడ్డారు.

ఈ ప్రభుత్వాలన్నీ ప్రజలకు చాలా దూరం అయ్యాయన్నాము. 'ప్రజా స్వామ్యాన్ని' గురించి జరుగుతున్న చర్చలో ఇది చాలా ముఖ్యమయిన అంశం.

పాశ్చాత్య దేశాలలో నడుస్తున్న రాజకీయ వ్యవస్థే ఏకైక ప్రజాస్వామ్య రూపం అనే తప్పుడు ప్రచారం విస్తృతంగా జరుగుతూ వుంది. గోర్బచెవ్ దీనికి చాలా దోహదం చేస్తున్నాడు. కాని నిజానికి సోషలిస్టు నిర్మాణానికి అనుగుణ్యమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏ విధంగా వుండాలనే చర్చ ఇంకా కొనసాగించవలసి వుంది. ప్రజలు ఆ వ్యవస్థను తమదిగా భావించగలగాలి. దానితో 'మమేకం' కావాలి. నూతన సమాజాన్ని నిర్మించే చైతన్యాన్నే కాక స్వేచ్ఛను కూడా ఆ వ్యవస్థ ప్రజలకు కల్పించాలి. ప్రజల అభీష్టాలకు స్పందించాలి. ఆ అభీష్టాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. అదే సమయంలో వ్యవస్థ తిరోగామిశక్తుల మీద రాజీలేని పోరాటం చేయాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఈ లక్షణాలున్నాయని ఎవరు భ్రమించినా భారతదేశంలో బ్రతుకుతూ వున్నవాళ్ళం భ్రమించలేము. అయితే ఈ సోషలిస్టు రాజకీయ వ్యవస్థను ఆవిష్కరించే ప్రయత్నం చేయకుండా కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యమే ప్రజారాజ్యం అని సిద్ధాంతీకరించడం అన్ని సోషలిస్టు దేశాలలోనూ జరిగిన పొరపాటు. దానికి స్టాలిన్ కూడా దోహదం చేశాడని ఒప్పుకోవాలి.

ఈ నియంతృత్వం ఫలితంగా ప్రజలలో విపరీతమయిన నిరసన పేరుకు పోయింది. దానిని ఆసరా చేసుకుని గోర్బచెవ్ లాంటివాళ్ళు 'ప్రజాస్వామ్యం' పేరిట జనాన్ని ఆకట్టుకుంటున్నారు. సోషలిస్టు రాజకీయ వ్యవస్థకు అనుగుణ్యమయిన ఈ ప్రజాస్వామ్య రూపం ఏదన్న చర్చను పక్కకుపెట్టి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే ఏకైక ప్రజాస్వామ్య రూపం అని ప్రచారం చేస్తున్నారు. ఆ ముసుగు కింద మౌలిక మయిన సోషలిస్టు సిద్ధాంతాలనే కాదంటున్నారు.

సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం మరొక అక్టోబర్ విప్లవంతో తిరిగి ప్రారంభం కావాలి. అయితే ఈ లోపల గత 70 సంవత్సరాల చరిత్రను మార్క్సిస్టులు నిజాయితీగా పునఃపరిశీలించాలి. ఆత్మవిమర్శ చేసుకోవాలి. అపరిష్కృతంగా ఉండి పోయిన సిద్ధాంత సమస్యలనూ నిర్మాణ సమస్యలనూ పరిష్కరించుకొని ముందుకు సాగాలి. ఇన్నాళ్ళూ చెప్పిన అనేక అబద్ధాలు ఇకనైనా చెప్పడం మానేయాలి. నిజం చెప్తే శత్రువుకు ఉపయోగపడుతుందేమోనని భయపడడం మానేసి నిజం చెప్పలేని సోషలిజం శాస్త్రీయ సోషలిజం కాజాలదని గుర్తించాలి.

ఉదయం దినపత్రిక

26, 27 జనవరి 1990

V